ప్రజాశక్తి

బుధవారం 22 ఫిబ్రవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అమ్మకానికి తుమ్మపాల ?

- ప్రభుత్వాలేవైనా తప్పని గండం
- లిక్విడేటర్ నియామకంతో తొలగుతున్న భ్రమలు
- రెండో దశలో ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల అమ్మకం
- నోరు విప్పని పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్
- ఎమ్మెల్సీ ఎన్నికలయ్యాక అమ్మకపు ప్రక్రియ

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

తుమ్మపాల (అనకాపల్లి వివి రమణ కో - ఆపరేటివ్) సుగర్ ఫ్యాక్టరీ అమ్మకానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ అంశం రైతుల్లో తొలగిపోవడంతో, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పల్లవి అందుకొని ప్రచారంలో పెట్టింది. ఎన్నికల ప్రచారంలో సహకార సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరిస్తామని నమ్మించిన జగన్మోహన్‌రెడ్డి... అధికారం చేతికొచ్చాక ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్‌ను అర్ధాంతరంగా నిలిపివేసి, రైతులకు దారీతెన్నూలేకుండా చేశారు. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీలను ఒకేసారి అమ్మకానికి పెడితే జనంలో తిరగలేమనుకొని వాటిని ఒక్కొక్కటిగా అమ్మాలని చూస్తున్నారు. అందులో భాగంగానే రూ.450 కోట్లకు పైబడి స్థిరాస్తులు కలిగిన ఫ్యాక్టరీ ఆస్తులను అంచనా వేసేందుకు ప్రత్యేకంగా లిక్విడేటర్‌ను ప్రభుత్వం నియమించింది. లిక్విడేటర్ నియామకంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నా అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాత్రం నోరువిప్పడంలేదు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యాక ఫ్యాక్టరీ అమ్మకపు ప్రక్రియ ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిసింది. టిడిపి ప్రభుత్వ కాలంలో తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆ పార్టీ నాయకుడు ఎంవివిఎస్.మూర్తికి విక్రయించాలని చేసిన ప్రయత్నాలను రైతులు అడ్డుకున్నారు. తరువాత విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి తులసీరావుకు కట్టబెట్టాలని చేసిన ప్రయత్నాలూ ఫలించలేదు. ఫ్యాక్టరీ అమ్మకాలను ఆనాడు వ్యతిరేకించిన వైసిపి, ఇప్పుడు తుమ్మపాల సుగర్‌ను అమ్మకానికి పెట్టనుంది. ఫ్యాక్టరీలో రైతుల షేర్లు కంటే ప్రభుత్వ షేర్లు తక్కువ కావడంతో కో - ఆపరేటివ్ సుగర్ మిగతా 2లో..

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్‌కు..

వాలంటీర్లతో జనసమీకరణ తగదు

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్‌కు వాలంటీర్లతో జనసమీకరణ చేసే ప్రయత్నాలను ఆపాలని జిల్లా కలెక్టరు, ఎన్నికల ప్రధాన అధికారి మల్లికార్జునను ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారికీ ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాకు అజశర్మ ఓ ప్రకటన విడుదల చేశారు. వైసిపి అభ్యర్థి ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు బుధవారం నామినేషన్ వేస్తున్న సందర్భంగా జన సమీకరణ చేయాలని వార్డు వాలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి వాలంటీరు కనీసం ఐదుగురిని తీసుకు రావాలని చెప్పినట్టు తెలిసిందన్నారు. గతంలో వీరి ద్వారానే అర్హత లేని వారికి కూడా ఓట్లు నమోదు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు మరలా వారి సర్వీసులను అధికార పార్టీ నాయకులు దుర్వినియోగ పరుస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి జీతాలు పొందుతున్న వారిని ఇలా ఒక పార్టీకి అనుకూలంగా చేయాలని ఒత్తిడి తేవడం ఎన్నిక నియమావళికి విరుద్ధమన్నారు. ఇలాంటి వాటిని అనుమతిస్తే ఇక ఎన్నికలు ప్రజాస్వామ్య వాతావరణంలో జరిగే అవకాశమే ఉండదన్నారు. ఈ నేపథ్యంలో కలగచేసుకుని తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండవలసిన వాలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ జేబు సంస్థగా మారకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాట్లు పరిశీలన

ఏర్పాట్లును పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని, పెద్ద ఎత్తున పారిశ్రామిక పెటుబడులను రాబట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు పలువురు పారిశ్రామిక దిగ్గజాలు వస్తున్నట్టు చెప్పారు. వచ్చే నెల 3, 4 తేదీల్లో స్థానిక ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరుగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సమ్మిట్‌కు మిగతా 2లో..

ఎమ్మెల్సీ స్థానానికి మూడు నామినేషన్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ స్థానానికి సంబంధించి మంగళవారం ముగ్గురు అభ్యర్థులు జిల్లా సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తికి తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన బొడ్డేడ చంద్రకళ పద్మావతి స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. విశాఖపట్నం ఎంవిపి.కాలనీకి చెందిన కుందేటి సూర్య వెంకట సుభాష్ చంద్ర స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు గ్రామానికి చెందిన బండారు ఎస్‌విజె.ప్రతాప్ కుమార్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ నెల 16న నోటిఫికేషన్‌రాగా మంగళవారం నాటికి మొత్తం ఆరుగురు అభ్యర్థులు 10 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్టు అధికారులు తెలిపారు.

విద్యాలయాల్లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలు

▶ వార్త 8లో..

ఘనంగా రెడ్ బుక్ డే

▶ వార్త 4లో..

రమాప్రభ విజయానికి విస్తృత ప్రచారం

▶ వార్త 8లో..

బీచ్‌ను శుభ్రం చేసిన మందుబాబులు

మందుబాబులకు వినూత్న శిక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో మందుబాబులకు వింత శిక్షను అమలు చేసింది మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆదివారం పట్టుబడ్డ 52 మంది మందుబాబులకు ఆర్కే బీచ్‌లోని వ్యర్థాలను, చెత్తను పరిశుభ్రం చేయాలని ఆదేశించింది. దీంతో మందుబాబులంతా వరుసగా ఆర్కే బీచ్‌లోకి వచ్చి చెత్తను శుభ్రం చేశారు. విశాఖలోని మెట్రోపాలిటిన్ కోర్టు వేసిన ఈ శిక్ష ఇపుడు ఉమ్మడి విశాఖ జిల్లాలో చర్చనీయాంశమైంది.

పాఠశాలల విలీన చర్యలు ఆపండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 168 ప్రాథమిక పాఠశాలలను మూసేయాలన్న ఆలోచనను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషనలైజేషన్, పాఠశాలల విలీనానికి సంబంధించిన జిఒ 117, 128లపై కోర్టులో తుది తీర్పు రాకముందే అనధికారికంగా పాఠశాలలను విలీనం చేయడం సమంజసం కాదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులను విద్యకు దూరంచేసే నిర్ణయాలు చేయడం సరికాదన్నారు. గతంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 330 ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను కిలోమీటర్ దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో అనేక మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని గుర్తుచేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థుల నిష్పత్తికి తగినట్లు ఉపాధ్యాయులను నియమించాల్సిందిపోయి, తరగతులను విలీనంచేసి ఉపాధ్యాయులను మిగులు చూపించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ తప్పుడు విద్యా విధానాల వల్ల పేద విద్యార్థులకు చదువు అందుబాటులో లేకుండా పోతోందని, మరోవైపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ లేనందున నిరుద్యోగులకు నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేసిన పాఠశాలల్లో పది మంది కంటే తక్కువున్న ఒకటి, రెండు తరగతులను కిలోమీటర్ పరిధిలోని ప్రాథమిక, మిగతా 2లో..

BHARAT CO-OPERATIVE HOUSE BUILDING SOCIETY LTD.

No. B 1878, Thadi, Visakhapatnam. # 8-6-42/16
Magadha Empire, Pedawaltair, Visakhapatnam-530017

GENERAL BODY MEETING

This is to inform that the general body meeting of the BHARAT CO-OPERAPERATIVE HOUSE BUILDING SOCIETY LTD No. B 1878, will be held on 19-03-2023 (Sunday) by 10.00 A.M. at Hotel Diamond's Pearl, Sankaramatham Road Visakhapatnam, all the members are requested to attend the meeting without fail.

AGENDA : (1) Court cases bearing the LAAS No. 376/2009, at A.P. High Court Amaravathi (2) Final Audit report for the year 2021-22 (3) Expenditure for the year 2022-23 (4) Approval of the final Survey Report. (5) Any other items with the permission of the chair.

N.B. Registered plot owners are requested to submit the xerox copies of the documents for Verification.

Waltair Date : 21-2-2023 (LUNCH FOLLOWS)

P.RADHA KRISHNA MURTHY
Secretary
Cell : 9392759858

S.S.S.HARINATH BABU
President
Cell : 9848355376

మొదటి పేజీ తరువాయి..

అమ్మకానికి తుమ్మపాల ?

యాక్ట్ ప్రకారం ఫ్యాక్టరీ ఆస్తుల అమ్మకానికి అవకాశంలేనప్పటికీ, ఈసారి ఎలాగైనా విక్రయించి సొమ్ముచేసుకోవాలన్న యోచనలో ప్రభుత్వమున్నట్లు తెలుస్తోంది.

ఇదీ ఫ్యాక్టరీ చరిత్ర

1935లో 50 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ఏర్పాటై, వెయ్యి టన్నుల సామర్థ్యానికి తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ విస్తరించింది. ఈ ఫ్యాక్టరీ పరిధిలో 9 మండలాలకు చెందిన 151 గ్రామాల నుంచి రైతులు చెరకు సరఫరా చేసేవారు. తమ వాటా కింద 12,769 మంది రైతులు రూ.కోటీ 36 లక్షలా 81 వేలా 300ను పెట్టారు. దీంట్లో ప్రభుత్వ షేర్ కేవలం లక్ష రూపాయలుండడంతో పథకం ప్రకారం తమ వాటాను పెంచుకొనే ప్రయత్నంలో భాగంగా, ఫ్యాక్టరీ మరమ్మతులు, రైతుల బకాయిల నిమిత్తం ఇచ్చిన రూ.19 కోట్లా 52 లక్షలా 43 వేల రుణాన్ని తన షేర్ కింద మార్చుకుంది. మరో రూ.20.45 కోట్లను అప్పు కింద కింద ప్రభుత్వం చూపుతోంది. అన్నీ సక్రమంగా ఉన్న కాలంలో క్రషింగ్ సీజన్ ముగిశాక ప్రభుత్వ మందుల కంపెనీ ఐడిపిఎల్ సహకారంతో స్థానికంగానే పారాసెట్మాల్ సహా మరో రెండు ట్యాబ్లెట్లు తయారుచేసి ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేసే ఖ్యాతిని నాడు తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ గడించింది. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో మందుల తయారీ ఆగింది. తరువాత డిస్టలరీ యూనిట్ మూతపడింది. తొలుత 2015-16లో అప్పటి ప్రభుత్వం చెరుకు క్రషింగ్ ఆపింది. 2018-19 సీజన్‌లో తెరచి మళ్లీ క్రషింగ్ నిలిపివేసింది. ఇపుడా ప్యాక్టరీని చెరుకు రైతుల అవసరాలకు తగినట్లు ఈ ప్రభుత్వం ఆధునీకరించకపోగా గుండగుత్తుగా అమ్మకానికి పెడుతుండడం విమర్శలకు తావిస్తోంది.

నమ్మక ద్రోహం

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టే చర్యలను ప్రభుత్వం మానుకోవాలి. టిడిపి ప్రభుత్వం నుంచి వైసిపి ప్రభుత్వం వరకూ రైతులకు ద్రోహం చేస్తూనేవున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పెడతామని కొంతకాలంగా చెప్పి ఇప్పుడు అమ్మకానికి పెట్టడం నమ్మక ద్రోహం. రైతుల ఆమోదం, జనరల్‌బాడీ సమావేశం నిర్వహించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా లిక్విడేటర్‌ను నియమించడం సరికాదు. ప్రభుత్వ చర్యలను రైతు సంఘాల నేతలు, కార్మికులు ఐక్యంగా పోరాడి అడ్డుకుంటారు. ప్రభుత్వం వెనక్కుతగ్గకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.

- ఎ.బాలకృష్ణ, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

పాఠశాలల విలీన చర్యలు ఆపండి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడానికి సిద్ధపడటం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను విలీనం చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. ప్రైవేట్ విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర తగదన్నారు. పేద విద్యార్థులకు అన్యాయంచేసే నిర్ణయాలను ఉపసంహరించుకోకపోతే పాఠశాలల పరిరక్షణకు ప్రజాపోరాటాలు నిర్వహిస్తామన్నారు

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాట్లు పరిశీలన

రాష్ట్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలు, రాష్ట్రాల నుంచి పెట్టుబడిదారులను, పారిశ్రామిక దిగ్గజాలను ఆహ్వానించేందుకు పలు ప్రాంతాలలో రోడ్‌షోలు నిర్వహించామని తెలిపారు. సుమారు 40 నుంచి 45 దేశాలకు చెందిన ప్రతినిధులను విశాఖకు ఆహ్వానించామన్నారు. పలు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు కూడా సమ్మిట్‌కు హాజరవుతారన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడాలని, భూమి, నీరు, విద్యుత్తు సక్రమంగా అందించాలని సిఎం ఆదేశించారని అమర్‌నాథ్ తెలిపారు. ఇప్పటికే సమ్మిట్‌లో పాల్గొనేందుకు 4800 మంది రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు.

నగరంలో శ్రీలక్ష్మి పర్యటన

విశాఖలో అంతర్జాతీయ స్థాయిలో మార్చిలో జరగబోయే జి-20 సదస్సుకు చేపట్టాల్సిన అభివృద్ధి, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం సిడిఎంఎ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, ఎపి గ్రీన్ కార్పొరేషన్ ఎమ్‌డి రాజశేఖర రెడ్డిలతో కలిసి ఆమె నగరంలోని ర్యాడిసన్ హోటల్ నుంచి సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, సీతకొండ, పార్క్ హోటల్ జంక్షన్, ఎయు ఇన్ గేటు, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ సహా పలు ప్రాంతాల్లో పర్యటించారు.

భీశెట్టి శారదకు సత్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒకనాటి సంచలన నాటక, సినీ రచయిత, సీనియర్ పాత్రికేయులు భీశెట్టి లక్ష్మణరావు సతీమణి శారదను రచయిత, శ్రీ గౌరీ విజ్ఞాన మండలి వ్యవస్థాపకులు బివి.అప్పారావు దంపతులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బర్మాకాందిశీకులైనప్పటికీ 1968లో భారత దేశానికి వచ్చిన భీశెట్టి లక్ష్మణరావు ప్రసిద్ధ రచయితగా రాణించడంలో ఆయన సతీమణి శారద సహకారం చాలా విలువైనది అన్నారు.

గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహాశివరాత్రి సందర్భంగా సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతయిన ఉమ్మడి అనిల్ కుమార్ (23), మరుపల్లి ప్రవీణ్ (21) మృతదేహాలు మంగళవారం మధ్యాహ్నం గల్లంతైన చోటునే లభించాయని అధికారులు తెలిపారు. శివరాత్రి స్నానాలకు పడవలో వీరు తమ కుటుంబ సభ్యులతో కలిసి సముద్రంలోకి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే.

'ఉక్కు'పై ప్రధాన పార్టీలు మోడీని నిలదీయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రత్యక్షంగా 30 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేనలు ప్రధాని మోడీని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారానికి 691వ రోజుకు చేరాయి. దీక్షల్లో మున్సిపల్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న వేలాది ఎకరాల భూములను ప్రైవేట్‌వారికి అప్పగించడానికి చూస్తుండటం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.నాయుడు, ఇ.ఆదినారాయణ, ఐ.రాంబాబు, డి.రామలక్ష్మి, ఎన్.రాజు, లోకేష్, రాము పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు శిక్షణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జెడి ఫౌండేషన్ చైర్మన్ వివి.లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలో తాము శిక్షణ ఇచ్చిన విద్యార్థుల్లో 98.2 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వారికి ఫిజికల్ ఈవెంట్స్‌లో శిక్షణను ఎయు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ప్రారంభించామన్నారు. వారికీ, ఆసక్తిగలవారికీ మెయిన్స్ పరీక్ష వరకూ ఐఎసిఇ వారి ఆధ్వర్యంలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9100061893 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అక్రమ బదిలీలు ఆపండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాత నగరంలోని ప్రభుత్వ విక్టోరియా ఘోషాసుపత్రిలో అక్రమ బదిలీలు ఆపాలని, అక్రమంగా బదిలీ చేసిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ మహిళా ఉద్యోగి రాధ బదిలీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హాస్పిటల్ ప్రధాన గేటు ఎదుట ఎపి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పడాల రమణ మాట్లాడారు.

వాల్తేర్ డిఆర్‌ఎంకు ప్రశంసలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కె.రామ్మోహన్ నాయుడు వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి సేవలను ప్రశంసించారు. రైలు వినియోగదారుల కోసం సౌకర్యాలను మెరుగుపరచడంలో డిఆర్‌ఎం మెరుగైన పనితీరు కనబరిచారని కొనియాడారు. ఈ మేరకు మంగళవారం డిఆర్‌ఎం కార్యాలయంలోనే అనుప్ సత్పతికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పలు సమస్యలనూ చర్చించారు.

డిఆర్‌ఎంను సత్కరిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

జగన్ పాలనలో ప్రజలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగన్ పాలనలో ప్రజలకు రక్షణ కరువైందని, గన్నవరం ఘటనతో ప్రజల్లో అభద్రతాభావం కలిగిందని, తక్షణమే అందుకు కారణమైన స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్ట్ చేయాలని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి పాలన ఇంత దుర్మార్గంగా ఉంటుందని ప్రజలు భావించలేదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొండ్రు మురళి, టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IST ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. NO. 1233/2019

Between :
M/s Srinivasa Agencies,
Rep. by its Prop. T.Vinod ... Plaintiff
and
Hayagriva Marketing, Rep. by its Prop. G. Veerababu, R/o D.No. 46-15-32, Kondrapa Complex, Opp. Bata Showroom, Dondaparthy, Visakhapatnam.... Defendant

పై నెంబరు దావాను, వాది, ప్రతివాదిపై దాఖలు చేసుకొని ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనని కారణంగా, కోర్టువారు ఈ పబ్లికేషన్‌ను, ఆర్డర్ చేయుచూ ది. 16-03-2023వ తేదీన ఉదయం 10-30 గం.లకు ప్రతివాది స్వయంగా గానీ, అడ్వకేటుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొన వలెను. లేనియెడల దావాను మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

కొటారి శ్రీనివాసరావు,
వాది తరఫు అడ్వకేటు,
పటమట, విజయవాడ.

విజయవాడ.
తేది:21-02-2023

రి.క.నెం.166/2023/ఎ
తేది: 17-02-2023

తహాశీల్దార్ వారి కార్యాలయము
గోపాలపట్నం

<u>పత్రికా ప్రకటన</u>

గోపాలపట్నం మండలం, మాధవధార గ్రామ కాపురస్తురాలు, శ్రీమతి కమలా బెనర్జీ, భర్త సూర్యదేబ్ బెనర్జీ లేట్, డో.నెం. 39-9-1/9, ప్లాట్‌నెం. 201, విఘ్నేశ్వర నివాస్, మాధవధార గ్రామం, గోపాలపట్నం మండలం, విశాఖపట్నం వారు, ఈక్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసిందిగా కోరియున్నారు.

గ్రామము పేరు	సర్వే నెంబర్	విస్తీర్ణము
మాధవధార గ్రామం	40-7A1B2 Part	27.5 Sq.Yards

పైన తెలిపిన భూమికి నిరభ్యంతర ధృవీకరణ పత్రము మంజూరు చేయుటకు ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా శ్రీ జాయింటు కలెక్టర్ మరియు కాంపిటేంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టర్ కార్యాలయము, విశాఖపట్నం వారికి మరియు శ్రీ తహాశీల్దారు, గోపాలపట్నం వారికి లిఖితపూర్వకముగా తెలియజేయవలసిందిగా కోరడమైనది.

తహాశీల్దార్
గోపాలపట్నం మండలం, విశాఖపట్నం

IN THE HONOURABLE COURT OF THE I ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
<u>O.S. 235 / 2022</u>

<u>Between:</u>
J.V.Prabhakar . . . Plaintiff
<u>And:</u>
Jowdula Bhanu Tulasi Lakshmi ...Defendant

<u>SUIT NOTICE TO THE DEFENDANT</u>

To,
Smt. Jowdula Bhanu Tulasi Lakshmi, W/o. Jowdula Rajesh,
R/at. D.No. 39-26-28/5,
Rajeev Nagar, Near Punjab Hotel,
Visakhapatnam-530018.

ఇందుమూలంగా ప్రతివాది అయిన, పైన ఉదహరించిన దావాలో అనగా విశాఖపట్నం నగరం ఒకటవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఒ.ఎస్.నెం. 235/2022లో వాది అయిన శ్రీ జె.వి.ప్రభాకర్‌గారు ప్రతివాది అయిన Smt. Jowdula Bhanu Tulasi Lakshmi అను మీ పై రూ. 32,03,834/- (అక్షరలా ముప్పై రెండు లక్షల మూడు వేల ఎనిమిది వందల ముప్పై నాలుగు రూపాయలు మాత్రమే) బాకీ వసూలు నిమిత్తం దావా వేసియున్నారు. ఈ దావాలో ప్రతివాది అయిన మీరు అనగా Smt. Jowdula Bhanu Tulasi Lakshmi గారు పై కోర్టు నందు హాజరగు నిమిత్తం **<u>తేది: 14-03-2022న</u>** వాయిదా వేసియున్నారు. కావున ప్రతివాది అయిన మీరు గానీ మీ తరపున లాయరు గారు గానీ, మీ తరుపున ఏజంట్ గారు గానీ **<u>తే:14-03-2023న ఉదయం 10-30 గంలకు</u>** పై కోర్టుకు హాజరుకాగలరు. లేనియెడల మీ పరోక్షమున కేసు పరిష్కరించి తీర్పు చెప్పగలరని తెలియ జేయుడమైనది.

K.S.SURESH KUMAR
V.R.JHANSI
Advocates for Plaintiff
Visakhapatnam. Cell : 9966248215

<u>బహిరంగ ప్రకటన</u>
మహారాజశ్రీ భీమునిపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
<u>I.A.No.1477/22 O.S.No. 135/22</u>

<u>బిట్వీన్:</u>
వి.క్రాంతి . . . పిటిషనరు-వాది
<u>మరియు:</u>
అంధవరపు రామకృష్ణారావు వగైరాలు
. . . రెస్పాండెంట్లు - ప్రతివాద్లు

<u>టు:</u>
అంధవరపు రామకృష్ణారావు,
తండ్రి లేటు బుచ్చయ్య, హిందూ,
వయస్సు 71 సం॥,
R/o. డో.నెం. 24-6-1/3రు
వినాయకనగర్, ఉడాకాలనీ,
నియర్ ప్రగతిపార్కు, పెదగంట్యాడ,
గాజువాక, విశాఖపట్నం.

పై నెంబరు దావాలో 1వ రెస్పాండెంటు-ప్రతివాది అయిన మీకు నోటీసులు జారీ నిమిత్తం కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా సమన్లు పంపించినప్పటికి మీరు గుర్తెరిగి కూడ తీసుకోకుండా తప్పించుకొనుచున్నందున SubStituted Service దారా సర్వు నిమిత్తం పై కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేస్తూ **<u>తే:9-3-2023దీని ఉదయం 10-30 ని॥లకు</u>** కోర్టులో హాజరై స్వయంగా గాని వకీలుగారి ద్వారా గాని మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకొనవలెనన్ని, లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

పి.సుందర్‌సింగ్
యం.సిహెచ్.పాత్రుడు
కె.వసంత
న్యాయవాదులు,
భీమునిపట్నం.

భీమునిపట్నం.
తేది:21-02-23

గీతంలో భట్నాగర్ జయంతి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ జయంతిని నిర్వహించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని భట్నాగర్ ప్రయోగశాల వద్ద మంగళవారం జరిగిన రీసెర్చర్స్ డే కార్యక్రమంలో భట్నాగర్ విగ్రహం వద్ద గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వేదవతి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజహితానికి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు ఉపయోగపడాలన్నారు. భారత దేశం విజ్ఞాన శాస్త్ర రంగంలో అభివృద్ధి చెందడానికి సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ వంటి పరిశోధకుల దూరదృష్టి కారణం అన్నారు. విశ్వవిద్యాలయాలలో జరిగే పరిశోధనలు సామాన్యులకు చేరాలన్నారు. శాంతి స్వరూప్ భట్నాగర్‌ను సైన్స్ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చి స్కాలర్లు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిలో 'సంవిధ'

ప్రజాశక్తి -మధురవాడ : నేషనల్ మేనేజ్‌మెంట్ డే సందర్భంగా ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ సహకారంతో రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ కళాశాల (ఎ) డిగ్రీ, పీజీ కోర్సుల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో సంవిధ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌పిసిఎల్ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ కె.నగేష్ ముఖ్య అతిథిగా హాజరై ఎంబిఎ, ఎంహెచ్ఆర్ఎం, బిబిఎ విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్ధమాన పారిశ్రామికవేత్తలు కలిగి ఉండాల్సిన విశిష్ట నాయకత్వ లక్షణాలపై తన ఆలోచనలను పంచుకున్నారు. అనంతరం జివిపి జాయింట్ సెక్రటరీ, ప్రొఫెసర్ డి కామేశ్వరరావు, జివిపి వ్యవస్థాపక సభ్యుడు ప్రొఫెసర్ పి.వి.శర్మ, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రజని, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థి వ్యవహారాల డీన్, పరీక్షల నియంత్రణాధికారి, కళాశాల ఐఐపిసి డైరెక్టర్, ఛైర్మన్ విశాఖపట్నం చాప్టర్ డాక్టర్ ఒఆర్ఎం రావు సభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విజేతలకు బహుమతి అందిస్తున్న ఉపాధ్యాయులు

ఉన్నత విద్యపై అవగాహన

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.చిట్టిబాబు సహకారంతో ఉన్నత విద్యపై ఎక్యూజె కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుధారాణి, ప్రతినిధులు ఎల్.గోవిందరావు, డి.రవిప్రకాష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : ఎండాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివేకానందనగర్ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం గురువారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. వివేకానందనగర్, సిర్లుడి నగర్, పెట్రోల్ బంక్ వెనుక భాగం, దసపల్లా లే-అవుట్ ఏరియాకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తుక్కు విక్రయంపై పరిశీలన

ప్రజాశక్తి -పిఎం పాలెం : బక్కన్నపాలెం సమీపంలో ఉన్న ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ (ఐటిఐ శిక్షణ ఉత్పత్తి కేంద్రం)లో తుక్కు విక్రయంపై, విలువైన వృక్షాలు మాయంపై క్షేత్రస్థాయిలో ఉద్యానవనం, అటవీశాఖ అధికారులు బృందాలుగా మంగళవారం పరిశీలించారు. జరిగిన అవినీతిపై ఇప్పటికే ప్రిన్సిపల్ అబద్దాన్ని, ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.విజయకుమార్‌ను, ఇన్‌స్పెక్టర్ పి.వి.రమణమూర్తిని సస్పెండ్ చేసిన విషయం విదితమే. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసేందుకు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ కమిటీ అధికారి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సుబ్బిరెడ్డి, సబ్ డిఎఫ్ఒ ధర్మ రక్షిత్, జిల్లా హార్టికల్చర్ అధికారి మన్మధరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇంఛార్జి జె.మాధవి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ డి.కోటేశ్వర రావు నరికివేతకు గురైన విలువైన వృక్షాలను పరిశీలించారు. పచ్చ తురాయి, తోగాము, బోగడ, శిస్సు, టేకు విలువైన వృక్షాలు నరికివేతకు గురైనట్లు గుర్తించారు. వృక్షాల వయసు, పొడవు, విలువను బట్టి ఎంత స్థాయిలో ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేయనున్నారు.

వృక్షాలు మాయంపై పరిశీలిస్తున్న దర్యాప్తు బృందం సభ్యులు

వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి పోస్టర్‌ను విడుదల చేస్తున్న నూకరాజు తదితరులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసువెళ్లి ఎండ గట్టాలని కార్యకర్తలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పిలుపు నిచ్చారు. జివిఎంసి మూడో వార్డు అప్పికొండ వీధిలో "ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం నిర్వహించారు. పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ, వైసిపి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, ప్రతి పక్షాల గొంతు నొక్కుతుందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.నూకరాజు, నరసింగరావు, శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి – ఆరిలోవ : నవ యువ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, యువ చైతన్య ఛారిటబుల్ ట్రస్టు సభ్యుడు పీలా మనోజ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆరిలోవ అమ్మా నాన్న ట్రస్టు ఆధ్వర్యాన నడుపుతున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నవ యువ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పిహెచ్‌సిని సందర్శించిన వెల్‌నెస్ కన్సల్టెంట్

పిహెచ్‌సిని సందర్శించిన రాష్ట్ర వెల్‌నెస్ కేంద్రాల ప్రతినిధి

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రాల కన్సల్టెంట్ ప్రతినిధి శాంతి సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా శిశుసంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు అమలు, గర్భిణులకు రక్త పరీక్షలు చేసే విధానాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య అధికారి ఉమావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.శైలజ, డాక్టర్ నళిని పాల్గొన్నారు

ఎంఆర్‌పిఎస్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-పద్మనాభం : భీమిలి నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీని ఏర్పాటుచేసినట్లు జిల్లా అధ్యక్షులు మోర్ల రమణ తెలిపారు. భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ములపర్తి పైడిరాజు, పద్మనాభం మండల అధ్యక్షులుగా కణితి ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా దేవరపల్లి అప్పలరాజు, ఆనందపురం మండల అధ్యక్షులుగా మారడపూడి అప్పారావు, ఉపాధ్యక్షులుగా లెంక పైడిరాజు, నియోజకవర్గ ప్రచార కార్యదర్శిగా ములపర్తి శంకర్‌తో పాటు కొన్ని గ్రామ కమిటీలను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు.

ఎంఆర్‌పిఎస్ అనంతవరం గ్రామ అధ్యక్షులుగా కడితి రాము, ఉపాధ్యక్షులుగా జామి గోవిందరావు, గంధవరం అధ్యక్షులుగా కింతాడ సింహాచలం, ఉపాధ్యక్షులుగా కొత్తల ముత్యాలు, విలాస్‌ఖాన్‌పాలెం గ్రామ అధ్యక్షునిగా కణితి ముత్యాలు, కృష్ణాపురం అధ్యక్షులుగా ములపర్తి ఎర్రిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి వారంతా పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్‌సి వర్గీకరణలో బిజెపి అన్యాయం

ఎస్‌సి వర్గీకరణపై నిర్ణయం తీసుకోవడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని మోర్ల రమణ ఆరోపించారు. పద్మనాభం మండలంలోని రెడ్డిపల్లిలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 22 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జిల్లాల వారీగా పాదయాత్ర చేస్తామని చెప్పారు. మార్చి 15న ఎస్‌సి వర్గీ కరణపై రాజమండ్రి నుంచి అమరావతి వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

నేరాలు ఘోరాలు

రుషికొండ బీచ్‌లో యువకుని మృతదేహం

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండ బీచ్‌లో రాళ్లమధ్య ఇరుక్కుని ఉన్న యువకుడి మృతదేహం మంగళవారం బయటపడింది. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... మారికవలసకు చెందిన ఎస్.యోగేష్ (22) ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ పూర్తిచేశాడు. తండ్రి ఉమామహేశ్వరరావు ఒడిశాలోని స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. మృతుడు అలిగి సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మంగళవారం మృతిచెంది కనిపించాడు. కుమారుడు మృతిచెందినట్లు తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. ఆరిలోవ పోలీసు కానిస్టేబుల్ రాజా, స్థానిక కమ్యూనిటీ గార్డులు సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి కెజిహెచ్ మార్చురీకి తరలించారు.

పలు దొంగతనం కేసులు ఛేదన

- అరెస్టయిన వారిలో ఇద్దరు మైనర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భీమిలి, గాజువాక పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు దొంగతనం కేసులను పోలీసులు ఛేదించారు. ఆ వివరాలను మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి జి.నాగన్న వెల్లడించారు. భీమునిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు నెలల్లో జరిగిన ఎనిమిది దొంగతనం కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 15న భీమిలి చిన్న బజారుకు చెందిన కలిదిండి సుహార్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ ఇంట్లోని రెండున్నర తులాల బంగారం చోరీకి గురైన విషయాన్ని తెలియజేశాడు. ఈ కేసుతో పాటు మరొక ఏడు కేసుల్లో ప్రమేయం ఉన్న ఇద్దరు జువైనల్ నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.16 లక్షల 40 వేలు విలువైన 30.5 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన మరొక ఆరుగురు రిసీవర్లను కూడా అరెస్టు చేశారు. ప్రధాన నిందితులిద్దరూ 16, 17 సంవత్సరాలవారే. అందులో ఒకరు పదో తరగతి మధ్యలో మానేయగా, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. జల్సాలకు అలవాటు పడి వీరు ఈ దొంగతనాలకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు.

వేరొక కేసులో గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్లు దొంగతనం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. విజయనగరం గొర్ల గ్రామానికి చెందిన కనకం దామోదర్ ఈ కేసులో ప్రధాన నిందితుడని డిసిపి పేర్కొన్నారు. గతంలో 15 దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. అతని నుంచి సుమారు 8 లక్షల విలువైన 39 సెల్‌ఫోన్లు, 2 లక్షల రూపాయల నగదు, ఒక లాప్‌టాప్, తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పై రెండు కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిసిఎస్ భీమిలి, ఆనందపురం గాజువాక క్రైమ్ సిబ్బందిని నాగన్న అభినందించారు.

గంజాయి తాగుతున్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ కెవిఆర్ పార్క్ సమీపంలో గంజాయి తాగుతున్న ఐదుగురు యువకులను స్టీల్ ప్లాంట్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. నిందితుల నుంచి ఐదు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల ఇచ్చిన సమాచారం మేరకు లంకెలపాలెం, అగనంపూడి ప్రాంతాలలో ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 525 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసినవారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎసిపి త్రినాథ్, ఉక్కునగరం పోలీసులు తెలిపారు.

టెన్త్‌లో ఫలితాలు మెరుగ్గా ఉండాలి

- డిఇఒ చంద్రకళ

ప్రజాశక్తి -భీమునిపట్నం : టెన్త్‌లో ఫలితాలు మెరుగ్గా ఉండేలా కసరత్తు చేయాలని, పక్కా ప్రణాళిక అవసరమని డిఇఒ ఎల్.చంద్రకళ ఉపాధ్యాయులకు సూచించారు. భీమిలి మండలం, తాటితూరు జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. టెన్త్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. పలు రికార్డులు, నోట్స్‌లను ఆమె పరిశీలించారు.

నోట్స్‌లు పరిశీలిస్తున్న డిఇఒ చంద్రకళ

ఘనంగా రెడ్ బుక్ డే

జిఒ 71లో అనేక లోపాలు : పల్లా

ప్రజాశక్తి- గాజువాక : జిఒ 71లో అనేక లోపాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. గాజువాక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణమే గాజువాక భూ సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి నాలుగేళ్ల తర్వాత మోసపూరితమైన జిఒను తీసుకొచ్చారని విమర్శించారు. గాజువాక ప్రజలను మోసగించాలని చూడడం దుర్మార్గం అన్నారు. గాజువాక భూ సమస్య పరిష్కారానికి ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన జిఒ 44ను గౌరవించి 1500 లబ్ధిదారులకు చంద్రబాబు ప్రభుత్వం ప్లాన్ అప్రూవల్, రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించారని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా గాజువాక భూ సమస్యను పరిష్కరించాలని చిత్తశుద్ధితో సుమారు 7500 మంది లబ్ధిదారులకు అతి తక్కువ రేట్లకే 301 పట్టాలు పంపిణీ చేశారని చెప్పారు. జిఒ 279 ద్వారా రెండేళ్లకు పట్టాలపై హక్కులు కల్పించారని తెలిపారు. ఈ ప్రభుత్వం ఆ పట్టాలపై ఆంక్షలు ఎత్తివేసి రిజిస్ట్రేషన్, ప్లాన్ అప్రూవల్ చేసుకునే వెసులుబాటు కల్పించాల్సింది పోయి, మరలా 7500 మంది మండల కార్యాలయం చుట్టూ తిరిగేటట్లు చేసి ఈ పట్టాల పేరుతో బ్రోకర్ల ద్వారా కోట్లాది రూపాయలు దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. జిఒ 60 పేరుతో ఇంకా క్రమబద్ధీకరణ చేసుకొని వారి నుంచి అధిక రేట్లు వసూలు చేసి అప్పుల్లో ఉన్న రాష్ట్ర ఖజానాకు జమ చేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. గాజువాక భూ సమస్యను జిఒ 301లో ఇచ్చిన తక్కువ రేట్లు ద్వారా క్రమబద్ధకరించాలని కోరారు. గాజువాక ప్రజలపై ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిఒ 60, 71లపై మళ్లీ సమీక్షించాలని, జిఒ 301 ఆధారంగా క్రమబద్ధకరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మరో పోరాటానికి సిద్ధపడతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్యదర్శి మొల్లి పెంటిరాజు, జిల్లా పార్టీ కార్యదర్శి గంతకూరు అప్పారావు, నాయకులు నామాల పెంటయ్య, గోమాడ వాసు, తమరి శివప్రసాద్, బలగ బాలునాయుడు, రట్టి వాసు, బైపల్లి గాంధీ, నమ్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

47వ వార్డులో కెకె.రాజు పర్యటన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి రాంజీ ఎస్టేట్ -1, జగజ్జీవన్ నగర్, అరుంధతి నగర్, సురేష్ రామ్‌నగర్, అంబేద్కర్ ఎస్టేట్ -1, 2, కప్పరాడ ప్రాంతాల్లో 47వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం పర్యటించారు. స్థానికుల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, రాంజీ ఎస్టేట్ యుపిహెచ్‌సి పనులు, రక్షణ గోడలు, కొండవాలు ప్రాంతాలలో మెట్లు, కాలువల మరమ్మతులు, వీధి కుళాయిలు, సురేష్ రామనగర్‌లో కళా వేదిక భవనాలు, సామాజిక భవనాలు నిర్మాణాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 47వ వార్డు నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, కొరుబిల్లి విజయ్, రాఘవులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో వస్త్ర దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి -మాధవధార : మురళీనగర్‌లో ఆర్‌కె ఎంటర్‌ప్రైజెస్ మ్యాచింగ్ హౌస్ మిషన్ ఎంబ్రాయిడరీ, వస్త్ర దుకాణాన్ని మంగళవారం వైసిపి మహిళా నాయకులు పేడాడ రమణికుమారి ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎంబ్రాయిడరీ మిషన్లు ఎంతగానో దోహద పడతాయన్నారు. నిర్వాహకురాలు కవిత మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎంబ్రాయిడరీ మిషన్లు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటితో అతి కొద్ది సమయంలోనే చీరలకు ఎంబ్రాయిడరీ చేయవచ్చని చెప్పారు. ఈ మిషన్లు ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా ప్రాంతాల్లో ఎంబ్రాయిడరీ మిషన్లు ఎక్కువగా అమ్ముడవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర, ఎంబ్రాయిడరీ దుకాణాన్ని ప్రారంభిస్తున్న పేడాడ రమణికుమారి

మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మంగళవారం రెడ్ బుక్ డేను ఘనంగా నిర్వహించారు. మహాకవి శ్రీశ్రీ మహా ప్రస్థానం కవితలను ఉత్సాహంగా పఠించారు.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు, వామపక్షవాదులు, అభ్యుదయవాదులు, కవులు, కళాకారులు, సాహితీ ప్రియులు రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1848లో కార్ల్ మార్క్స్, ఫెడరిక్ ఎంగెల్స్ కమ్యూనిస్టు మేనిఫెస్టోని ఫిబ్రవరి 21న ఆవిష్కరించారన్నారు. రెడ్ బుక్ డే ప్రాముఖ్యతను వివరించారు. అలాగే శ్రీశ్రీ మహాప్రస్థానంలోని గేయాలు, కవితల్లో ఉన్న సారాంశాన్ని తెలియజేశారు. సమస్యలన్నిటికీ పరిష్కార సూచికలుగా శ్రీశ్రీ కవితలు ఉంటాయన్నారు. వాటిని అర్థం చేసుకొని సమాజ మార్పునకు కృషి చేయాలన్నారు. పార్టీ జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శాస్త్రి, జివిఎన్.చలపతి, జిఎస్.రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : స్థానిక సిఐటియు కార్యాలయంలో మహాప్రస్థానం రచనలపై చర్చించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువతను చైతన్యపరిచే పద సంపద శ్రీశ్రీ కవితల్లో ఉందన్నారు. ఆయన కవితలను స్ఫూర్తిగా తీసుకొని ఎంతో మంది రచయితలుగా ఎదిగారని తెలిపారు. కళా రంగంలో యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా శ్రీశ్రీ మహా ప్రస్థానం పఠనం

ములగాడ : జివిఎంసి 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో మహాప్రస్థానం కవితలు పఠనం చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మహాప్రస్థానంలోని పలు కవితలను ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నేటి దోపిడీ సమాజాన్ని మార్చాలంటే మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని అన్వయించుకొని శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. 59వ వార్డు పరిధి నెహ్రూనగర్, 62వ వార్డు పరిధి దుర్గానగర్, 63వ వార్డు పరిధి చింతల్లోవలోనూ రెడ్‌బుక్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, పివి.భాస్కరరావు, ఎల్.కృష్ణ, పి.రామారావు, ఎన్.శ్రీనివాసరావు, పి.సురేష్, వై.గంగాధర్, నీలయ్య హరి, బి.శ్రీను, వెంకటేష్, రాజు, గణేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : కొమ్మాది కూడలిలోని సిఐటియు కార్యాలయంలో శ్రీ శ్రీ కవితలు ఆలపించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, సిపిఎం జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, డి కొండమ్మ, బి.భారతి, డి.శైలజ, విజయ్, ఎస్.రామప్పుడు, కె.సుజాత పాల్గొన్నారు.

కంచరపాలెం : కంచరపాలెంలోని బివిఆర్ భవన్‌లో శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానంలోని కవితలను చదివి వినిపించారు. మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని సాహితీ స్రవంతి కన్వీనర్ పెంటకోట రామారావు ప్రారంభించారు. సాహితీ స్రవంతి జిల్లా కమిటీ సభ్యులు పలమరెట్టి ఫ్రాన్సిస్, బొడ్డు కూర్మారావు, కె.స్వతంత్రకుమార్ కవితా విశ్లేషణ చేశారు. సుమారు 20 మంది కవులు, ప్రజా నాట్యమండలి గాయకుడు పందిరి రాము పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, కె.నాగరాణి, భాగం లక్ష్మి, అన్నాబత్తుల నరసింగరావు, కె.రాము, సోమి వెంకట్, బాబాజీ పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక పరిధి దశమకొండ, భానోజీ తోట, జోగావానిపాలెం, స్వతంత్ర నగర్‌లో రెడ్ బుక్ డే నిర్వహించారు. మహాప్రస్థానం కవితలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమాల్లో ఎం.శ్రీదేవి, సంతోషం, వరలక్ష్మి, మంగ, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అనిత, ఎం.రాంబాబు, ఎ.లోకేశ్వరరావు పాల్గొన్నారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో జరిగిన రెడ్ బుక్ డే కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం రెడ్ బుక్ డే సందర్భంగా చదువుదాం సమాజాన్ని మారుద్దాం అనే కార్యక్రమాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీశ్రీ మహాప్రస్థానం కవితలు పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, వనం సూర్యనారాయణ, అభిమానులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సమాజం మార్పుకు కష్టజీవులు శ్రమజీవులు కలిసి రావాలని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకట అప్పారావు పిలుపునిచ్చారు. రెడ్ బుక్ డే సందర్భంగా హరిపాలెంలో మహాప్రస్థానం పుస్తక పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఆర్ రాము, కె.సోమనాయుడు, ఎం రామ్ కుమార్, కర్రి అప్పారావు, కాంగ్రేగుల రామ సదాశివరావు, శరగడం కనుము నాయుడు, బుద్ద రంగారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

క్రాంతినగర్‌లో మాట్లాడుతున్న జగ్గునాయుడు

నూతన వేతనాల అమలుకు వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మికులకు నూతన వేతనాలు అమలుచేయాలని విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి తగు సూచనలతో కూడిన ఆదేశాలను ఇవ్వాలని ఎన్‌జెసిఎస్ కన్వీనర్‌కు స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా రాసిన లేఖను సిఎండి అతుల్‌భట్‌కు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రతినిధులు మంగళవారం అందించారు. లేఖలో లలిత్‌మిశ్రా పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి... "దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులకు అక్టోబర్ 21 నూతన వేతన ఒప్పందం జరిగింది. ఒప్పంద సమయంలో ఎన్‌జెసిఎస్ కన్వీనర్‌గా మీరు ఉన్నారు. ఎన్‌జెసిఎస్‌లో భాగస్వామ్యంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులకు నూతన వేతనాలు ఇంత వరకు అమలు చేయలేదు. దీనిపై కన్వీనర్‌గా మీరు దృష్టి సారించి తక్షణం సమస్యను పరిష్కరించాలి' అని కోరుతూ లేఖ విడుదల చేశారు.

ఈ లేఖను సిఎండికి ఆయన కార్యాలయంలో అందించిన అనంతరం స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, కార్మికులు అంకిత భావంతో పనిచేసి ఉత్పత్తిలో రికార్డులను సృష్టిస్తున్నారని తెలిపారు. తద్వారా పరిశ్రమ ఆర్థిక పరిస్థితి మరింత మెరుగవుతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి తగిన వెసులుబాటు ఉందని తెలిపారు. ఆ దిశగా చర్యలు చేపట్టి కార్మికులను ఉత్సాహపరిస్తే ఉత్పత్తి, ఉత్పాదకతలలో కార్మికుల సామర్థ్యం పెరుగుతుందని స్పష్టం చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన నూతన పెన్షన్ విధానంపై కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, దీనికి నూతన వేతన ఒప్పందం అమలు కాకపోవడం వల్ల తీవ్ర నష్టానికి గురి అవుతున్నారని వివరించారు. కార్మికుల ఆర్థిక నష్టాలను తగ్గించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, సెయిల్‌లో కార్మికుల నూతన వేతన ఒప్పందం అమలుతో పాటు బకాయిలను కూడా సెయిల్ యాజమాన్యం చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులను, అధికారులకు ప్రోత్సహించేందుకు యాజమాన్యం కృషిచేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్ మాట్లాడుతూ, స్టీల్ కార్మికులు కృషి వల్ల నేడు ఉత్పత్తి, ఉత్పాదకతలు రికార్డు స్థాయిలో వస్తున్నాయని, తద్వారా పరిశ్రమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడే దిశగా ఉందని తెలిపారు. ఈ విషయంపై స్టీల్ అధికారులతో చర్చిస్తానని చెప్పారు.

సిఎండి అతుల్‌భట్‌కు వినతిని అందిస్తున్న అయోధ్యరామ్ తదితరులు

తుమ్మపాల సుగర్స్ జోలికొస్తే ఖబడ్దార్

- లిక్విడేటర్‌ను రద్దు చేయాలని టిడిపి ఆందోళన
- మాజీ ఎమ్మెల్యే పీలాతో సహా పలువురు అరెస్టు

ప్రజాశక్తి- అనకాపల్లి

తుమ్మపాల వివి రమణ సహకార చక్కర కర్మాగారం అప్పులు ఆస్తుల వివరాలు తెలుసుకునేందుకు నియమించిన లిక్విడేటరును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఫ్యాక్టరీ గేటు వద్ద మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యాన ఆ పార్టీ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా, సభ్య రైతుల అనుమతి లేకుండా లిక్విడేటర్‌ను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఫ్యాక్టరీకి రూ.30 కోట్ల అప్పులు చూపించి 300 కోట్ల విలువైన ఆస్తులను దోచుకునేందుకు మంత్రి అమర్‌నాథ్ కుట్ర పన్నారని ఆరోపించారు. సుగర్ ఫ్యాక్టరీపై ఆధారపడి 13 వేల కుటుంబాలు ఉన్నాయని, వారే అమర్‌నాథ్‌ను తరిమి కొడతారని పేర్కొన్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ వచ్చి లిఖితపూర్వక హామీ ఇచ్చేవరకు ధర్నా ఆపేది లేదని రోడ్డుపై బైఠాయించారు. ఫ్యాక్టరీ జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీంతో పోలీసులు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళనకారులను సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే టిడిపి శ్రేణులు జెసి రావాలని పట్టుబట్టడంతో ఇరు వర్గాలకు కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో పాటు 25 మంది మంది నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట్ని బాలాజీ, మల్ల సురేంద్ర, కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబి, నడిపల్లి గణేష్, తలారి కాశి నాయుడు, చదరం కాశి, సబ్బవరపు గణేష్, పోలవరపు త్రినాథ్, ఆకుల శ్రీను, చెక్కల శ్రీనివాసరావు, శెట్టి వెంకట రమణ, సందిన సునీల్, కొణతాల రత్నకుమారి, వేగి వెంకటరావు, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పీలాను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఆర్ఎఆర్ఎస్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె విరమణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పరిశోధన స్థానాలు, డాట్ సెంటర్లు, కృషి విజ్ఞాన కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మెను మంగళవారం విరమించారు. సమ్మె నేపథ్యంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్, జాయింట్ రిజిస్ట్రార్, ఇతర అధికారులతో మూడు దఫాలు చర్చలు జరిగిన మీదట కార్మికుల డిమాండ్లలో కొన్నింటిని అంగీకరించినట్టు సిఐటియు నాయకులు గంట శ్రీరామ్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ చంద్రశేఖర్ తెలిపారు. కాంట్రాక్టు లేబర్‌కు ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ ప్రకారం రోజుకు రూ.46 పెంచేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. పెరిగిన జీతాన్ని బకాయిలతో సహా చెల్లిస్తామని, అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు కార్మికుల విలీనం చేయమని సంబంధిత పరిశోధన స్థానాల ఏడిఆర్లకు తెలియజేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కొత్త కాంట్రాక్టరుకు ఇచ్చేటప్పుడు కాంట్రాక్టు వర్కర్లకు ఒకటి రెండు నెలలు జీతాలు ఆలస్యమైనా కాంట్రాక్టర్ చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, తమ పరిధిలో లేని డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రిజిస్ట్రార్ చెప్పినట్లు శ్రీరామ్ తెలిపారు. దీంతో సమ్మెను విరమించినట్లు పేర్కొన్నారు.

బాధితులకు ఫోన్లు అందజేసిన ఎస్‌పి గౌతమిసాలి తదితరులు

రికవరీ మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా పోలీసులు రెండవ విడతలో రికవరీ చేసిన రూ.23 లక్షల విలువైన 110 మొబైల్ ఫోన్లను మంగళవారం బాధితులకు ఎస్పీ గౌతమి సాలి అందజేశారు. మొబైల్ ట్రేస్ చేసిన ఐటీ కోర్ సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడతలో రూ.25 లక్షల విలువ చేసే 131 మొబైల్ ఫోన్లను అందజేయగా, రెండోసారి 110 మొబైల్‌లను ఆంధ్ర, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి రికవరీ చేసి అందించామని చెప్పారు. మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటే బాధితులు 9505200100కు హాయ్ టైప్ చేసి, akpmobiletracker.in లింకు ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి విజయభాస్కర్, ఇన్స్పెక్టర్లు నరసింహారావు, లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, ఐటీ కోర్ ఎస్సై రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండల కేంద్రం బుచ్చయ్యపేటలో ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలు, ముగ్గుల పోటీలు, ఎడ్ల పరుగు పందాల పోటీలు నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి ఎడ్ల పందాల పోటీలు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాదిమంది తరలివచ్చి తిలకించారు. కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. విజేతలకు బహుమతులను అందజేశారు.

ఎడ్ల పరుగు పందెం జరుగుతున్న దృశ్యం

డిఇఒను కలిసిన యుటిఎఫ్ బృందం

డిఇఒకు పుష్పగుచ్ఛం, డైరీ ఇచ్చి అభినందనలు తెలుపుతున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వెంకట లక్ష్మమ్మను మంగళవారం యుటిఎఫ్ జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాలు తమ పాత్ర పోషించాలని సూచించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్న అబ్బాయి మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన సంఘంగా విద్యా వ్యవస్థ అభివృద్ధికి, విద్యాశాఖ అధికారులకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవ అధ్యక్షులు ఎన్ సుబ్బారావు, జిల్లా కార్యదర్శి జిఎస్ ప్రకాష్, మండల నాయకులు దేవుడు నాయుడు, ఎస్ నూకరాజు కె కామరాజు, రమేష్, రవి, శ్రీను సీనియర్ నాయకులు జీకేఆర్ స్వామి, అలివేలు, అజయ్, రేఖ, అరుణ, తేజ్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు పైలా శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి - పరవాడ

పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి ఆదీప్ రాజ్ జన్మదిన వేడుకలు పరవాడ వైసిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి రాష్ట్ర సీసీ సభ్యులు పైలా శ్రీనివాసరావు, జెడ్పిటిసి పైలా సన్యాసిరాజు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బందం నాగేశ్వరరావు, వైసిపి నాయకులు కోన రామారావు, చుక్క రాము నాయుడు, చింతకాయలు ముత్యాలు, బోద్దపు వెంకటరమణ, వెన్నెల అప్పారావు, పైల సన్యాసిరావు, బొండా కనకారావు, బోద్దపు చిన్నారావు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

సబ్బవరం : పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ జన్మదినం సందర్భంగా మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారికి మంగళవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాసరావు ఆర్థిక సహాయం సుమారు లక్షా 60 వేల రూపాయలతో కుట్టు మిషన్లను సమకూర్చారు. స్థానిక సర్పంచ్ బోకం స్వామినాయుడు ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్ రాజ్‌కు పంచాయితీ పాలక వర్గం జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వనం దేముడుబాబు, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, బోకం కాసుబాబు, బోకం రమణ, చొప్ప బంగారయ్య, బోకం నాగేశ్వరరావు, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ స్వామినాయుడు తదితరులు

మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ శ్రీనివాసరావు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ట్రాఫిక్ సిఐ టి శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ కమిటీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురికాకతప్పదన్నారు. ర్యాగింగ్ వల్ల ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉందని, విద్యార్థులు సోదర భావంతో మెలగాలని సూచించారు. అనంతరం ఒక ఉపాధ్యాయుడు, ఒక ఉపాధ్యాయుని, ఒక పోలీస్ కానిస్టేబుల్, ఒక సీనియర్ విద్యార్థి, ఒక జూనియర్ విద్యార్థితో యాంటీ ర్యాగింగ్ కమిటీని వేశారు. కళాశాలలో ఒక ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేశారు. ఎవరికన్నా సమస్య వస్తే ఆ బాక్స్‌లో చీటీపై రాసి వేయాలని, వారానికి ఒకసారి బాక్స్ తెరచి సంబంధిత ఫిర్యాదు పై చర్య తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణాల పంపిణీ

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని లాలం కొత్తూరు విశాఖ డెయిరీ పాల సంఘం సభ్యులు 16 మందికి రూ.8.80 లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు మాట్లాడుతూ ప్రతి రైతు పాల దిగుబడి పెంచాలని సూచించారు. విశాఖ డెయిరీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

రుణాలు అందజేస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణారావు

మాట్లాడుతున్న బుద్ధ రాజేష్, చిత్రంలో వెంకటరావు

'గవర కులస్తులకు ఎమ్మెల్సీ ఇవ్వకపోవడం అన్యాయం'

ప్రజాశక్తి - అనకాపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లాలో కాపులు, వెలమలు తరువాత అత్యధిక శాతం ఉన్న గవర కులస్తులకు వైసిపి ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడం అన్యాయమని గవర కుల సంక్షేమ సంఘం నాయకులు బుద్ధ రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం 18 ఎమ్మెల్సీ స్థానాలు ప్రకటించిందని, వాటిలో కనీసం ఒక్కటి కూడా గవరలకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. టిడిపి ప్రభుత్వం తమ కులానికి సముచిత స్థానం కల్పించగా వైసిపి ప్రభుత్వం తమను అనగదొక్కే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఒక గవర కార్పొరేషన్ చైర్మన్ పదవి తప్ప వైసిపి ప్రభుత్వం రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టుల్లోనూ కేటాయించలేదన్నారు. ఇలాగే కొనసాగితే 2024 ఎన్నికల్లో గవరలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో బొడ్డేడ వెంకటరావు పాల్గొన్నారు.

జగన్ ఆదేశాలతోనే రావణకాష్టంగా రాష్ట్రం

ప్రజాశక్తి- అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఆదేశాలతోనే రాష్ట్రం రావణ కాష్టంగా మారుతోందని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అరాచకత్వం, రాక్షసత్వంతో రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేస్తున్న విషయాన్ని గన్నవరం సంఘటన రుజువు చేస్తుందని పేర్కొన్నారు. కళంకిత పోలీస్ అధికారులు దగ్గరుండి టిడిపి కార్యాలయంపై దాడి చేయించారని ఆరోపించారు. జగన్ రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ చట్టం సెక్షన్ 307 దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. గన్నవరం టిడిపి కార్యాలయం పై వంశీ అనుచరులు విచక్షణ రహితంగా రౌడీ మూకలతో దాడి చేయించి మారణ హోమం సృష్టించారని తెలిపారు. తమ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం అన్యాయమన్నారు. పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను జగన్ రెడ్డి ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో వైసీపీకి దండన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి, దాడి ముసలి నాయుడు పాల్గొన్నారు.

పరదేశిమాంబ పండగ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని తవ్వవాని పాలెం ఈ నెల 28న నిర్వహించనున్న గ్రామ దేవత పరదేశి మాంబ అమ్మవారి పండగ కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బోకం స్వామి నాయుడు మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో ఈ నెల 22న షటిల్ బ్యాడ్మింటన్, 25న ముగ్గుల పోటీలు, 26న కోలాటం పోటీలు, 24న రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్, 27న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు, 28న గుర్రం పందాలు, భారీ మందుగుండు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమానికి ప్రముఖ సినీ హీరోయిన్ నేహా శెట్టి హాజరవుతారన్నారు. సినీ యాక్టర్ అనసూయ, జబర్దస్త్ యాంకర్ సౌమ్యారావు, జబర్దస్త్ రాకెట్ రాఘవ టీం, డీ-15 డాన్సర్లు పాల్గొనున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ వనం దేముడుబాబు, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, బోకం కాసుబాబు, బోకం రమణ, చొప్ప బంగారయ్య, బోకం నాగేశ్వరరావు, బి.మహేష్ పాల్గొన్నారు.

36 మంది రక్తదానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వైసీపీ యువజన విభాగం మండల అధ్యక్షులు సరగడం జగ్గారావు జన్మదిన సందర్భంగా మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో మంగళవారం ఆయరన మిత్రమండలి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 36 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ బీసీ సెల్ మునగపాక మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్, తిమ్మరాజుపేట పిఎసిఎస్ ఉపాధ్యక్షుడు భీశెట్టి అమ్ము నాయుడు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ చేరడం రాము, బి శెట్టి అప్పలనాయుడు మీనా తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వివాద భూముల్లో

పంటలు వేయడంపై చర్యలు తీసుకోవాలి

- చనిపోయిన వ్యక్తి పేరు మీద కేసు వేసి భూమిని స్వాధీనంలో ఉంచుకున్న ఆక్రమణదారులు

- రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న ఆగ్రహం

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి రెవెన్యూ పరిధి 20, 280/1, 281/1, 281/2 సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూములు కోర్టు వివాదంలో ఉండగా, ఆక్రమణదారులు ఆ భూముల్లో పంటలు వేస్తున్నారని, అయినా దేవరాపల్లి రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పై సర్వే నెంబర్లలో ఉన్న భూములు ప్రభుత్వ భూములుగా కోర్టులు తీర్పులు ఇవ్వగా, వాటిని గతంలో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అయినా ఆక్రమణదారులు ఆ భూముల్లో పంటలు వేసి ఫలసాయం పొందుతున్నారని పేర్కొన్నారు. కోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఆ భూముల్లో పంటలు వేయకూడదని నిబంధన ఉన్నా లెక్కచేయకుండా ఇప్పుడు ఏకంగా దీర్ఘకాలిక పంటలు వేస్తున్నారని వెల్లడించారు.

సర్వే నెంబర్ 280/1లో గతంలో డి పట్టా పొందిన క్షత్రియ దేవిసింగ్ అనే వ్యక్తి చనిపోగా, ఆయన పేరున ఆక్రమణదారులు హైకోర్టులో కేసు వేసి భూమిని తమ స్వాధీనం ఉంచుకున్నారని పేర్కొన్నారు. 281/2 సర్వే నెంబరులోని భూమికి 281/2ఎ సర్వే నెంబర్‌తో తప్పుడు రికార్డు సృష్టించి, కోర్టును తప్పుదారి పట్టించి ఫలసాయం తీసుకున్నారని తెలిపారు. సర్వే నెంబరు 20లో ఉన్న భూమి ప్రభుత్వ భూమిగా ఇప్పటికే దాదాపు పదిసార్లు కోర్టులు తీర్పులు ఇచ్చినా, గతంలో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నా, ఆక్రమణదారులు అందులో పంటలు వేస్తున్నారని వెల్లడించారు. ఆక్రమణదారులు ఉన్నత పదవుల్లో ఉన్న వారు, వారి బంధువులు కావడంతోనే రెవెన్యూ అధికారులు నోరు మెదపడం లేదని తెలిపారు. కోర్టు వివాదంలో ఉన్న భూముల్లో పంటలు వేయాడాన్ని నివారించడానికి అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడుకు రెండు సార్లు బహిరంగ లేఖ రాశామని, ప్రస్తుత తహశీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా కనీసం పట్టించుకోలేదన్నారు. వెంటనే దీనిపై స్పందించకుంటే కోర్టు ధిక్కారణ కింద రెవెన్యూ అధికారులపై హైకోర్టును ఆశ్రయిస్తామని వెంకన్న హెచ్చరించారు.

వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

వ్యక్తిత్వ వికాసంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సెట్విస్ జిల్లా మేనేజర్ నూకరాజు అన్నారు. కైట్స్ జూనియర్, డిగ్రీ కళాశాలలో మంగళవారం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంతో సులభంగా ఉద్యోగ అవకాశాలు సాధించవచ్చని తెలిపారు. ఇంటర్ డిగ్రీ తర్వాత ఏఏ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయో ద్వారా తెలుసుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు చాలా కీలకంగా పనిచేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎస్.నూకరాజు, కైట్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆడారి అప్పలనాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆడారి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు, పోలీసుల మధ్య వాగ్వివాదం

బ్రాండిక్స్ పైపులైన్ పనుల అడ్డగింత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మరమ్మతులు పేరుతో బ్రాండిక్స్ చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనులను మత్స్యకారులు మంగళవారం అడ్డుకున్నారు. దీంతో పోలీసులు చేరుకొని వారిని వారించారు. ఈ నేపథ్యంలో పోలీసులు, మత్స్యకారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు పి.పారు నాయుడు మాట్లాడుతూ పైప్‌లైన్ నిర్మాణం సమయంలో మత్స్యకారులతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు మిగిలి ఉన్న మత్స్యకారులకు ప్యాకేజీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మత్యకార యువకులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు వి అప్పన్న, వాసుపల్లి అశోక్, మెరుగు రాజేష్, దుంపయ్ రాజు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌కు సీలింగ్ ఫ్యాన్ల వితరణ

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మంగళవారం రెండు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు ముక్కు మాల వెంకట్రావు, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి సుమన్, గుమ్మడి శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి - పరవాడ : మండల కేంద్రం పరవాడ గ్రామంలో మంగళవారం పరదేశిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి పరదేశమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైల సన్యాసిరావు, పైల రామచంద్రరావు, పైల చినఅక్కునాయుడు, పైల బుజ్జి, పైల కృష్ణ, పైల సీతారాం, ఈర్ల సతీష్, పోతల గోపి, సతీష్, గణపర్తి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని పలు చోట్ల మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాతృభాష ఆవశ్యకత, తెలుగు భాష గొప్పతనం గురించి పలువురు ప్రసంగించారు.

ప్రజాశక్తి- సబ్బవరం

అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్. చిన్నమ్మాయి అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మండల విద్యా శాఖాధికారి ఎస్.అప్పలరాజు మాట్లాడుతూ అమ్మ ఒడి నుండి మొదట నేర్చుకొనే భాష మాతృ భాష అని, మనస్సులోని భావాలను సహజంగా వ్యక్తం చేయగల శక్తి మాతృభాషలోనే ఉందని తెలిపారు. నేడు మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ పరభాషల వెంట పరుగులు తీస్తున్నారన్నారు. ఇతర భాషలను నేర్చుకోవడం అవసరమే, కానీ ఆ నెపంతో మాతృభాషను చిన్న చూపు చూడరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు డి.రాంప్రసాద్, సిహెచ్.కుమార్ ప్రకాష్, నాగమణి, పిడి రెహమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి తెలుగువానిపై ఉందని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం వన్ వే ట్రాఫిక్ జంక్షన్‌లో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాదచారులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు విన్నకోట నీలేష్ గుప్తా, వి.సత్యనారాయణ, ఆర్ మల్లేశ్వరరావు, పి కష్ణమోహన్, పిరాట్ల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : తెలుగు భాష అమ్మలాంటిదని అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు తెలిపారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది మెయిన్ స్కూల్లో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పిల్లలకు తెలుగు భాష పై వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషలో ఉన్న గొప్పతనాన్ని పిల్లలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టీవీ శేషగిరిరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట : రావికమతం మండలం టి. అర్జాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కెఆర్ఎస్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలంకరణ చేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిఆర్‌పి గుంటూరు రామారావు మాట్లాడుతూ. తేనెలొలుకు తెలుగుభాష పరిరక్షణకు అందరం కట్టుబడి ఉందామని కోరారు. ఈ సందర్భంగా మాతృభాష ఆవశ్యకతపై విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయినులు వరహాలమ్మ, త్రివేణి పాల్గొన్నారు..

మాడుగుల : మనోవికాసానికి మాతృభాష ఎంతో అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి అన్నారు. మంగళవారం కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు మాతృభాష తెలుగుపై మక్కువ, ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. తెలుగు విభాగాధిపతి వులపర్తి పైడిరాజు మాట్లాడుతూ మాతృభాష సాహిత్యాలను అధ్యయనం చేయడం ద్వారా హదయోల్లాసం కలుగుతుందన్నారు కార్యక్రమంలో అధ్యాపకులు షర్మిల, డాక్టర్ రమణ మూర్తి, రాజు, నారాయణ, సులోచన, రామకుమార్ బోధనేతర సిబ్బంది సులేమాన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.తీయోపిల్లస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి డాక్టర్ బి.సుబ్బయ్య మాట్లాడుతూ, భాష యొక్క విలువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ.ఫ్లోరా, వైస్ ప్రిన్సిపల్ బాల్బన్, ఎజ రవిబాబు, ఎన్ఎస్ఎస్ పిఒలు మంజుల, గౌతంబాబు, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుండెలనిండా తెలుగు నిండి ఉండాలి

ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం టిఎల్ఎన్ సభామందిరంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా 'అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం-తెలుగు ప్రాశస్త్యం' సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మాట్లాడారు. మన గుండెల నిండా తెలుగు నిండి ఉండాలన్నారు. భవిష్యత్ తరానికి భాషను అందించే బాధ్యత యువతపై ఉందన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు శలాక రఘునాథశర్మ మాట్లాడుతూ, తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ పరభాషల అవసరాన్ని వివరించారు. ప్యారిస్ నుంచి వచ్చిన తెలుగు భాషాభిమాని డేనియల్ నేజర్స్ దేవదేవ మహాదేవ శ్లోకంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, సమైక్య భారతి జాతీయ గౌరవాధ్యక్షులు మూర్తి రేమెళ్ల, తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య కె.శ్రీనివాస్, సాలూరు వాసూరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అతిథులను వర్సిటీ తరపున సత్కరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎయు అధికారులు, ప్రముఖులు

వైసిపి అరాచకాలను ప్రోత్సహిస్తే చేటు

పోలీసు గౌరవాన్ని జగన్‌కు తాకట్టు పెట్టొద్దు

టిడిపి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను ప్రోత్సాహించేలా పోలీసులు వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి చేటు అని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మీడియాకు పంపిన వీడియో ప్రకటనలో. పోలీసు ఉద్యోగం పవిత్రత, గౌరవాన్ని జగన్ ప్రభుత్వానికి తాకట్టు పెట్టేలా వ్యవహరించవద్దని హితవు పలికారు. గన్నవరం టిడిపి కార్యాలయం వద్ద ఏం జరిగిందో? ఎవరు దాడి చేశారో పోలీసులకు తెలియదా అని ప్రశ్నించారు. వంశీ అనే వ్యక్తిపై మీడియా సమావేశంలో మాట్లాడితే, కత్తులు, కర్రలతో దాడి చేసి టిడిపి కార్యాలయాన్ని ధ్వంసం చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలను ఖండించి, కఠిన చర్యలు తీసుకోవాలేగానీ, గూండాలకు, అరాచక శక్తులకు సహకరించి పోలీసు గౌరవానికి చెడ్డపేరు తేవద్దని కోరారు.

సామర్లకోట ప్రాంతంలో చంద్రబాబు సభ పెడితే ఆయన్ను అడ్డగించడం, విపక్షనేత కాన్వాయ్‌కు అడ్డంగా వాహనాలు పెట్టడం సిగ్గుచేటన్నారు జెడ్ కేటగిరీ సెక్యూరిటీ ఉన్న ఒక మాజీ ముఖ్యమంత్రి పట్ల బాధ్యత గల పోలీసుల యంత్రాంగం వ్యవహరించాల్సిన తీరు ఇదేనా అని ప్రశ్నించారు. టిడిపి నేతలు, శ్రేణులకు సహనం ఎక్కువని, అంతగా తొందరపడే తత్వం ఎవరి రక్తంలోనూ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి, విపక్షనేతను ఏడు కిలోమీటర్లు నడిపించడం, అక్కడ సభకు కరెంట్ కట్ చేసి ఇబ్బందులు కలిగించడం దుర్మార్గమన్నారు. చీకట్లో చంద్రబాబుకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

పట్టాభి ఏ తప్పు చేశారని అరెస్ట్ చేశారో చెప్పాలన్నారు. పట్టాభికి ఏమైనా హాని జరిగితే డిజిపితోపాటు పోలీసుశాఖ బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. టిడిపి కార్యాలయంపై వైసిపి గుండాలు దాడి చేస్తున్న సమయంలో అక్కడున్న పోలీసులకు దెబ్బలు తగిలినా అదేమంత పెద్ద సీరియస్ కానట్లు వ్యవహరించడం తగదన్నారు. రాష్ట్ర ప్రజలు టిడిపి వైపే ఉన్నారని, రానున్న కాలంలో తెలుగుదేశం అధికారంలోకి తథ్యం అని వైసిపి గుండాల చేస్తున్నా అరాచకాలు గుర్తుపెట్టుకుంటున్నామని, ఎప్పుడు ఏం చేయాలో అదే చేస్తామని హెచ్చరించారు.

వైద్యానికి వచ్చి నడిరోడ్డుపై వృద్ధుడు మృతి

రోడ్డుపైనే మృతి చెందిన వృద్ధుడు కృష్ణ

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : అనారోగ్య సమస్యతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వచ్చి, చికిత్స తీసుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలోనే నడిరోడ్డుపై వ్యక్తి మరణించిన సంఘటన మంగళవారం నర్సీపట్నం వేలంపేటలో చోటుచేసుకుంది. చింతపల్లి మండలం లోతుగడ్డ జంక్షన్‌కు చెందిన కటుమోన కృష్ణ (72) అనే వృద్ధుడు అనారోగ్యంతో వైద్య చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి వచ్చాడు. ఆసుపత్రిలో వైద్యసేవలు పొందిన తర్వాత తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో నడిరోడ్డుపై మృత్యువాత పడ్డాడు.సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

దొరబాబుకు ఘన సన్మానం

దొరబాబును సన్మానిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు రూ.25వేల విలువైన ప్రజా చిరునామా వ్యవస్థను నర్సీపట్నం వివేకానంద విద్యాసంస్థల అధినేత ఎఎన్ఎస్‌జి.దొరబాబు మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా దొరబాబును పాఠశాల ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ, సిబ్బంది ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ద్వారకా రాణి, విద్యా కమిటీ సభ్యులు చిట్ల చలపతి పాల్గొన్నారు.

ఉపమాక పుష్కరిణి పనుల పరిశీలన

చెరువును పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక పుష్కరిణి పరిశుభ్రత, అభివృద్ధి పనులను మంగళవారం ఎంపిడిఒ సీతారామరాజు, ఇఒపిఆర్‌డి వెంకట నారాయణ పరిశీలించారు. 'అస్తవ్యస్తంగా ఉపమాక పుష్కరిణి' శీర్షికతో ఈనెల 6న ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి దేవస్థానం అధికారుల్లో కదలిక వచ్చింది. చెరువు నిండా గడ్డి, నాచు, వ్యర్థాలతో నిండి, కలుషిత నీటితో దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు, భక్తులకు ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో స్థానిక రాజకీయ నేతలు, గ్రామస్తులు, భక్తులు టిటిడి దృష్టికి తీసుకెళ్ళారు.

టిటిడి యంత్రాంగం స్పందించి, పుష్కరిణిలోని నాచు, గడ్డి, చెత్త ఇతర వ్యర్థాలను కూలీలతో తొలగించే చర్యలను ప్రారంభించింది. నాలుగు రోజులుగా కూలీలు చేస్తున్న పనులను మంగళవారం ఎంపిడిఒ ఇఒపిఆర్‌డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సీతారామరాజు మాట్లాడుతూ, చెరువులోనినాచు, గడ్డి, వ్యర్థాలను తొలగించడం వల్ల అంతగా ప్రయోజనముండదని, వ్యర్థాలతోపాటు కలుషిత నీటిని కూడా బయటకు తొలగించాలని టిటిడి అధికారులకు సూచించారు. దీనిపై టిటిడి అధికారులు స్పందించి నీటిని తొలగింపు చర్యలు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నక్కపల్లి పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

దొండవాకలో పూరిళ్లు దగ్ధం

కాలు బూడిదైన పూరిళ్లు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని పెదతీనార్ల పంచాయతీ దొండవాక గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధమైంది. మైలపల్లి కొర్లమ్మ ఇంటిలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, ఇళ్లంతా వ్యాప్తి చెందడంతో సర్వం కాలి బూడిదైంది. స్థానికులు నుంచి సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.సుమారుగా రూ.రెండు లక్షలుఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

ఫ్రెషర్స్‌డే పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, ఐటి విభాగాల ఫ్రెషర్స్‌డే వేడుకలను మార్చి 18వ తేదీన నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆ కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విభాగాధిపతులు ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య కుంజం నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలపై చర్చా గోష్టి

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : న్యాయవాదుల సమస్యలపై విశాఖ బార్ సోసియేషన్‌లో మంగళవారం చర్చా గోష్టి నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు హాజరయ్యారు. న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్లపు వేణుగోపాల్ ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటుచేసి చర్చా గోష్టి సాగించారు. అనంతరం గంటా రామారావు మాట్లాడుతూ, న్యాయవాదులకు రాష్ట్ర పరిధిలో శిక్షణ అకాడమీ కోసం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని పదేపదే కోరినా స్పందనలేదన్నారు. రాష్ట్ర న్యాయవాదులంతా దీనిపై ఆలోచించి, బార్ కౌన్సిల్ ఆధ్వర్యాన స్థలాన్ని కొనుగోలు చేసి దాతల సహాయంతో న్యాయవాదుల శిక్షణ అకాడమీ భవనాన్ని నిర్మించాలన్న ఉద్దేశంలో ఉన్నట్లు వివరించారు. న్యాయమూర్తులకు శిక్షణ అకాడమీ ఉన్నట్లు న్యాయవాదులకు కూడా ఉండడం చాలా అవసరం అని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నుంచి రూ.12 కోట్లకు పైగా మ్యాచింగ్ గ్రాంట్ రాష్ట్ర న్యాయవాదుల సంఘానికి రావాల్సి ఉందని తెలిపారు. న్యాయవాదుల వెల్ఫేర్ స్టాంపు ఖరీదును ఇప్పుడున్న రూ.100 నుంచి రూ.200కు పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలియజేశారు. అనంతరం రామారావును విశాఖ బార్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సీనియర్ మెంబర్ ఎస్.కృష్ణమోహన్, పి.నర్సింగరావు, ఉపాధ్యక్షులు ఆర్మ్ జోగేశ్వరరావు, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు నమ్మి సన్నీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంచుల్లో మురుగునీరు

ప్రజలు, వాహనదారుల ఇక్కట్లు

పట్టించుకోని పంచాయతీ, అధికారులు

రోడ్డు వెంబడి అంచుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో ఎండపల్లి గ్రామం అపారిశుధ్యానికి అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గ్రామస్తులు వాడుతున్న మురుగునీరు ప్రవహించేందుకు డ్రైనేజ్ సదుపాయం లేకపోవడంతో గ్రామంలోని ప్రధాన రహదారి తారురోడ్డు వెంబడి మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ఇటు గ్రామస్తులతోపాటు అటు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

తారురోడ్డు వెంబడి మురుగునీరు ప్రవహిస్తుండడంతో రోడ్డు పాడౌతుందని పలువురు అంటున్నారు. అంతేకాక రోడ్లపై మురుగునీరుతో దోమల బెడద అధికమై సమీపంలోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం తీవ్ర అవస్థలు పడుతున్నారు .ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎండపల్లిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా అన్నవరం రహదారి

అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు

పట్టించుకోని అధికారులు, నేతలు

గోతులమయంగా ఉన్న అన్నవరం రోడ్డు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో అన్నవరం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అన్నవరం మీదుగా వేములపూడి, నాతవరం మండలం వెళ్లే రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా పంట పొలాలకు వెళ్లే రైతులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి రహదారి గోతులమయమై, అంచులు చెదిరిపోయి, అనేక చోట్ల రూపుకోల్పోయినంతగా పాడవ్వడంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రాత్రివేళ్లలో ఈ రోడ్డులో ప్రయాణం ప్రాణసాహసమేనని స్థానికులు వాపోతున్నారు. దీనిపైఅనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అన్నవరం రోడ్డును పునర్నిర్మించి పటిష్టపరచాలని, తద్వారా అటుగా రాకపోకలు సాగించేవారి ప్రయాణకష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి -మాకవరపాలెం : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీసర్వేతో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం. అవుతాయని తహశీల్దార్ ఎంవివి.ప్రసాదరావు అన్నారు. మంగళవారం గిడుతూరు గ్రామంలో రెండవ విడత భూ రీసర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా ఎనిమిది గ్రామాలలో రీసర్వే పూర్తయిందన్నారు. రీసర్వే అనంతరం భూయాజమానికి హక్కుపత్రాలను అందజేస్తామన్నారు. రీసర్వేకు రైతులు సహకరించాని, అదే సమయంలో సమస్యలేమైనా ఉంటే అధికారుల దృష్టికితీసుకురావాలన్నారు.

రామకృష్ణ పరమహంస జయంతి

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : సద్గురువు రామకృష్ణ పరమహంస 188వ జయంతోత్సవాలను పురస్కరించుకుని ధర్మవరం అగ్రహారం వివేకానంద కాలనీ ఆలయం వద్ద రామకష్ణ పరమహంస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమ నిర్వాహకులు కొరుప్రోలు రమణ మాట్లాడుతూ నేటి సమాజంలోని యువత రామకృష్ణ పరమహంస విధానాలను ఆచరించి, ఆదర్శవంతంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసి అచ్యుత్ కుమార్ (నాని), సాగి రమాదేవి, మాడా రమణ, కొరిబిల్లి సాయి పాల్గొన్నారు.

రమాప్రభ విజయానికి విస్తృత ప్రచారం

సిబిఐ మాజీ జెడిని కలిసి ఓటు అభ్యర్థిస్తున్న సిపిఎం నేతలు లోకనాథం, జగ్గునాయుడు, గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ ఆమె మద్దతుదారులు మంగళవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలోనే సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణను పిడిఎఫ్ అభ్యర్థి ప్రచార బృందం కలిసింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అవినీతి రహిత రాజకీయాలు కావాలన్నారు. సమాజ సేవకులు, మేధావులు చట్టసభల్లో ఉండాలని తెలిపారు. ప్రచారంలో పాల్గొన్న వారిలో సిపిఎం అనకాపల్లి, విశాఖ జిల్లా కార్యదర్శులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్, 250 సంఘాల బలపరిచిన అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ గెలుపు కోరుతూ మంగళవారం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు ఆధ్వర్యాన మండలంలోని సోమలింగపాలెం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులను, వారి తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కోరుబిల్లి సత్యనారాయణ, ఎల్లపు నూక నాయుడు, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల

అచ్యుతాపురంలో రైతులసంఘాల నేతల ప్రచారం

రోలుగుంటలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

రమాప్రభను గెలిపించాలని కోరుతూ రోలుగుంట మండల కేంద్రంలో మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె.గోవిందరావు, ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగావకాశాలు, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు, పెన్షనర్లు ఇలా అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి, చట్టసభల్లో ఈ ప్రాంత ప్రజల వాణిని వినిపించాలంటే, సమస్యలపై అవగాహన, పోరాటతత్వం ఉన్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరారు. విద్యావంతులైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్లంతా విజ్ఞతతో రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మడ్డు శ్రీరామ్మూర్తి, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నట్టా ? లేనట్టా?

అమలులో నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి -కోటవురట్ల : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నాలుగు రోజులు గడిచినా, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో అధికారులు నిర్లక్ష్యంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు, మండలంలో ప్రభుత్వ వాహనాలపై రాజకీయ నాయకుల చిత్రాలు దర్శనం ఇవ్వడం, అదేవిధంగా పలుచోట్ల ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలపై ముసుగులు ఇంకా వేయకపోవడం వంటి వాటిని చూపిస్తూ ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల జోలికి వెళ్లాలంటనే అధికారులు భయపడుతున్నారా? లేక ఈ ఎన్నికలకు ఎటువంటి నిబంధనలు వర్తించవా అంటూ చర్చించు కుంటున్నారు, అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని కోరుతున్నారు. ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని కోరుతున్నారు.

గ్రాట్యుటీ బకాయి చెల్లించాలని వినతి

డిసిసిబి ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డు ఉద్యోగులు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పిఎసిఎస్ కార్యదర్శిగా పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులు తమకు రావలసిన 20 నెలల గ్రాట్యుటీని ఇప్పించాలని డిసిసిబి ఛైర్మన్ అనిత సన్యాసిపాత్రుడుకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా రిటైర్ ఉద్యోగులు మాట్లాడుతూ ఛైర్మన్‌కు ఇచ్చిన వినతి పత్రానికి అనిత సానుకూలంగా స్పందించారన్నారు. 9:1 ప్రకారం పదోన్నతి పొంది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులుగా, మేనేజర్ గాను, అసిస్టెంట్ మేనేజర్ గాను, స్టాఫ్ అసిస్టెంటుగా రిటైర్ అయిన 45 మంది ఉద్యోగులకు పిఎసిఎస్ సర్వీస్ తీసుకొని 20 మాసాల గ్రాట్యుటీ చెల్లించి న్యాయం చేయాలని నర్సీపట్నంలోని డిసిసిబి ఛైర్మన్ అనిత నివాసానికి వెళ్లి విన్నవించామన్నారు. తమ సమస్యలన్నీ సానుకూలంగా విని, రిటైర్డ్ఉద్యోగులకు న్యాయం చేస్తానని హామీఇచ్చారన్నారు. త్వరలో బ్యాంకు సిఇఒను కూడా కలిసి విన్నవిస్తామన్నారు. కార్యక్రమములో బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు విల్లూరి పైడారావు, ఎంవి రమణ,. ఎస్ రమణ, సుర్ల నరసింహమూర్తి, వి నాగేశ్వరరావు , ఆర్ నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం కాశీపతి తదితరులు పాల్గొన్నారు

ముగిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ

కనోసా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి -పాయకరావుపేట : జాతీయ రహదారి పక్కనున్న కనోసా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు 2021-22 విద్యా సంవత్సరానికి హిందుస్థాన్ స్కౌట్స్ గైడ్స్ అసోసియేషన్ మూడు నెలల శిక్షణ మంగళవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ జి గని ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సిస్టర్ సోఫియా మేరీ అలెక్స్, పిఇటి శ్రీను సమక్షంలో శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉండాలి

వైద్యవిధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్ కిషోర్

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రమేష్ కిషోర్

ప్రజాశక్తి -నక్కపల్లి : వైద్యులు, సిబ్బంది స్థానికంగా నివాసముండి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ కిషోర్ హెచ్చరించారు..మంగళవారం నక్కపల్లిలోని 50 పడకల ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగుల వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఇతర గదులను, ఆసుపత్రిలోని వైద్యపరికరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి, తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి ఐడి కార్డు ధరించి, విధుల్లో పాల్గొనాలని, మందుల కొరత వుంటే వెంటనే సంబంధిత అధికారికి తెలియజేయాలన్నారు. ఏజెన్సీలోని ముంచింగిపుట్టు ఆసుపత్రిలో నెలకు 80 వరకు ప్రసూతి ఆపరేషన్లు జరుగుతున్న పరిస్థితుల్లో నక్కపల్లిలో తక్కువగా నమోదు కావడంపై వైద్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు నక్కపల్లిలో వివిధ ఆరోగ్య సమస్యలకు స్పెషలిస్ట్ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ప్రజలకు తెలియపరిచేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జనార్దన్, వైద్యులు ఈశ్వర్ ప్రసాద్, జయలక్ష్మి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలు

మాట్లాడుతున్న సిఐ గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జిల్లా ఎస్పీ గౌతమీశాలి ఆదేశాల మేరకు కాలేజీల్లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేశామనిటౌన్ సిఐ గణేష్ తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లోనూ ఈ కమిటీల ఏర్పాటుతోపాటు ప్రతి కాలేజీకి ఒక పోలీసును రక్షణకు నియమిస్తామని వెల్లడించారు. మంగళవారం రు స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఐ గణేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో సీనియర్ అధ్యాపకులు, ఉత్తమ నడవడిక గల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి కాలేజీలో పోలీసుశాఖ తరపున కంప్లైంట్ బాక్స్‌ను ఏర్పాటు చేస్తామని,విద్యార్థులకు ర్యాగింగ్,ఇతరత్రా ఏదైనా సమస్యల వస్తే చీటీలపై రాసి అందులో వేస్తే పరిశీలించి పరిష్కరిస్తామనారు. బాక్స్‌లో ఫిర్యాదులు వేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.ఇటీవల కొంతమంది విద్యార్థులు గంజాయి అక్రమ రవాణాకు సహకరిస్తున్నట్లు, గంజాయి, డ్రగ్స్, మద్యం ఇతర వ్యసనాలకు బానిసలై చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయని. అటువంటివారిపై పోలీసుశాఖాపరంగా చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ అనర్థాలపై అవగాహన కల్పించారు.

బదిలీ ఉపాధ్యాయినికి సత్కారం

వరలక్ష్మిని సన్మానిస్తున్న హెచ్ఎం బాలరాజు

ప్రజాశక్తి -గొలుగొండ : మండలంలోని గుండుపాల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేసి, ప్రమోషన్‌తో బదిలీపై బీడీగుమ్మల హైస్కూల్‌కు వెళ్లిన దాములూరి వరలక్ష్మిని మంగళవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా హెచ్ఎం బాలరాజు ఆధ్వర్యంలో వృత్తి పట్ల ఎంతో అంకితభావంతో పనిచేసిన వరలక్ష్మి వంటి టీచర్ వెళ్లిపోవడం పాఠశాలకు నష్టమేనని, అదే సమయంలో ఉద్యోగోన్నతిపై వెళ్లడం ఆనందమని శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ ప్రధానోపాధ్యాయులు రాము మాస్టారు మాట్లాడుతూ వరలక్ష్మీ టీచర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత వరలక్ష్మి మాట్లాడుతూ సహచర ఉపాధ్యాయులు, పిల్లల ఆదరాభిమానాలు పొందడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, పద్మ, అనూరాధ, కనకమహాలక్ష్మి, యుటిఎఫ్ నాయకులు చిట్టియ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల కేటాయింపులో

వైసిపి సామాజిక న్యాయం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఎమ్మెల్సీ అభ్యర్థుల కేటాయింపులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు, మహిళలకు తగు ప్రాధాన్యతనివ్వడం ద్వారా సామాజిక రాజకీయ న్యాయం చేకూర్చారని, ఆయా వర్గాల సాధికారతకు బాటలు వేశారని రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 18 ఎమ్మెల్సీ స్థానాలకు గాను 11 స్థానాలను బీసీ అభ్యర్థులకు కేటాయించి, బీసీలపై ఆయనకున్న ప్రేమను చాటుకున్నారన్నారు. అంతేకాక పార్టీ పదవులలో 50 శాతం రిజర్వేషన్లతో మహిళలకు సముచిత స్థానం కల్పించారన్నారు. వైసిపి నేత కర్రి రాంగోపాల్ ఉన్నారు.